క్లుప్తంగా

నేడు 3, 22 వార్డుల్లో ‘వై ఏపీ నీడ్స్ జగన్’

తెనాలి అర్బన్: పట్టణ పరిధిలోని 3, 22 వార్డుల్లో ‘వై ఏపీ నీడ్స్ జగన్’ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. 3వ వార్డు ఎన్వీఆర్ కాలనీ, 22వ వార్డు మారీసుపేట–2 సచివాలయాల వద్ద సభల నిర్వహణతో పాటు సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు తెలియజేసే బోర్డుల్ని ఆవిష్కరించనున్నట్లు వివరించారు. కౌన్సిలర్లు, అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

వచ్చే నెల 15నుంచి ‘ఆడుదాం ఆంధ్ర’

తెనాలి అర్బన్: ఆరోగ్యకరమైన జీవనశైలిని యువతలో ప్రోత్సహించేందుకు, ప్రతిభవంతులైన క్రీడాకారుల్ని పెద్ద వేదికలకు పరిచయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వచ్చే నెల 15నుంచి ‘ఆడుకుందాం ఆంధ్ర’ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వార్డు సచివాలయం నుంచి రాష్ట్రస్థాయి వరకు క్రీడా పోటీలు జరుగుతాయని, 15 ఏళ్ల దాటిన రాష్ట్రానికి చెందిన మహిళలు, పురుషులు అర్హులని తెలియజేశారు. వీరికి వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తారన్నారు. పోటీల సమయంలో అవసరమైన కిట్లను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. మంగళవారం నుంచి వచ్చే నెల 13 వరకు క్రీడాకారుల పేర్ల నమోదు సచివాలయాల్లో జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు వార్డు వలంటీర్లకు గాని, సచివాలయంలో గాని, ఆన్లైన్ పోర్టల్ 1902కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేయించుకోవాలని మున్సిపల్ కమిషనర్ సూచించారు.

కథను నమ్ముకుని సినిమాలు నిర్మిస్తే విజయవంతం

సినీ దర్శకుడు దిలీప్‌రాజా



తెనాలి అర్బన్: కథను నమ్ముకుని సినిమాలు తీస్తే విజయం దానాంతట అదే వరిస్తుందని మా ఏపీ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా పేర్కొన్నారు. మా ఏపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 15 సినిమాలు విజయవంతంగా ఆడాయని, వాటిలో 10 చిన్న సినిమాలే ఉన్నాయని చెప్పారు. సినిమాల్లో సత్తా ఉంటే ప్రేక్షకులే అందలం ఎక్కిస్తారని తెలిపారు. చిన్న సినిమాల్ని ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో నటులు మిలటరీ ప్రసాద్, అమీర్ చౌదరి పాల్గొన్నారు.

కేఎల్‌యూకు జాతీయ అవార్డు

మంగళగిరి: అత్యున్నత డిజిటల్ అభ్యాసాలను స్వీకరించడంతో పాటు విద్యార్థులకు వీడియోల రూపంలో పాఠ్యాంశాలు అర్థమయ్యేలా చేయడంతో కేఎల్ యూనివర్సిటీకి జాతీయ స్థాయి అవార్డు అందుకున్నట్లు ప్లానింగ్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ వి.రాజేష్ తెలిపారు. సోమవారం యూనివర్సిటీ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీన ఢిల్లీలోని ఐఐటీ ప్రాంగణంలో నిర్వహించిన సదస్సులో దేశంలో వీ బాక్స్ అనే సాఫ్ట్ వేర్ సంస్థ డీమ్డ్, ప్రైవేటు, ప్రభుత్వ విశ్వవిద్యాలయాల బోధనా ప్రమాణాలకు బట్టి ఆయా విశ్వవిద్యాలయాలను అవార్డులకు ఎంపిక చేయగా కేఎల్ యూనివర్సిటీ ఎంపికైందన్నారు. సదస్సులో పాల్గొన్న యూనివర్సిటీ అసోసియేట్ డీన్ కె.జ్యోతిష్య బ్రహ్మాచారి నేషనల్ ఎడ్యుకేషన్ ఫోరం చైర్మన్ అనిల్ సహస్ర బుద్ధే, మాజీ కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి కాన్పూర్ ఐఐటీ ప్రొఫెసర్ శర్మ, వీ బాక్స్ సాఫ్ట్ వేర్ సంస్థ సీఈఓ నిర్మల్ సింగ్ చేతుల మీదుగా అందుకున్నట్లు తెలిపారు. అవార్డు అందుకున్న జ్యోతిష్య బ్రహ్మాచారిని వీసీ జి.పార్థసారథి వర్మ అభినందించినట్లు పేర్కొన్నారు.

ఏఎన్‌యూలో ఆకట్టుకున్న సైన్స్ ప్రదర్శన



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జువాలజీ అండ్ ఆక్వా కల్చర్ విభాగంలో సోమవారం సైన్స్ ప్రదర్శన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో సంబూరు వివా స్కూలు విద్యార్థులు తిలకించారు. జువాలజీ ఉపయోగాలు, ప్రాముఖ్యత గురించి అధ్యాపకులు వివరించారు. విద్యార్థులకు సైన్స్ కోర్సులపై అవగాహన కల్పించడానికి వర్సిటీ కూడా ప్రదర్శనశాలలను ఏర్పాటు చేయనున్నట్లు జువాలజీ అండ్ ఆక్వా కల్చర్ విభాగాధిపతి, ఓఎస్డీ ఆచార్య కె. సునీత తెలిపారు. విద్యార్థులకు సైన్స్ కోర్సుల ప్రాముఖ్యతను జువాలజీ విద్యార్థులు వి. షణ్ముఖ కల్యాణ్, శివ కోటయ్య, రాజకుమార్ తదితరులు వివరించారు. కార్యక్రమంలో విభాగ అధ్యాపకులు ఆచార్య జి సింహాచలం, ఆచార్య వీరయ్య పాల్గొన్నారు.

ఓం నమశ్శివాయ.. ఓం నమశ్శివాయ

- భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు
- స్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు

తెనాలి టౌన్: కార్తిక పౌర్ణమి సోమవారం సందర్భంగా పట్టణంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి భక్తులు బారులు తీరారు.

- మారీసుపేటలోని బాలాత్రిపుర సుందరీ సమేత చంద్రమౌళేశ్వరస్వామి(శివాలయం)లో భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. బాలాత్రిపుర సుందరి అమ్మవారికి అర్చకులు ప్రత్యేక అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు.
- గంగానమ్మపేటలోని రామేశ్వరస్వామి ఆలయ (పాతశివాలయం)లో భక్తులు అధిక సంఖ్యలో బారులు తీరారు. స్వామిని దర్శించుకుని విశేష పూజలు జరిపారు.
- మారీసుపేట కోదండరామస్వామి ఆలయం(అప్పలస్వామి)లో విశేష పూజలు జరిపారు. 365 సాలగ్రామాలతో శివలింగ ఆకారం తయారు చేశారు. ఆలయ అర్చకులు సర్వజ్ఞ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు లంక శివానందకుమార్, శివాంజనేయప్రసాద్, కోశాధికారి కూనపల్లి నారాయణస్వామి, కె.మహేష్, భక్తులు పాల్గొన్నారు.
- రామలింగేశ్వపేటలోని రామలింగేశ్వరస్వామి దేవాలయంలో కార్తిక మాస సందర్భంగా భక్తులు విశేష పూజలు జరిపారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



అప్పలస్వామి ఆలయంలో సాలాగ్రామాలతో తయారు చేసిన శివలింగం.



మారీసుపేట శివాలయంలో బాలాత్రిపుర సుందరీదేవికి ప్రత్యేక అలంకరణ



మారీసుపేట శివాలయంలో భక్తులకు హారతి ఇస్తున్న అర్చకుడు



గంగానమ్మపేట శివాలయంలో బారులుతీరిన భక్తులు

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి

మున్నంగి(కొల్లిపర): కేంద్ర ప్రభుత్వ పథకాల్ని సద్వినియోగం చేసుకునేలా గ్రామస్థాయి అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని ఈవోపీఆర్డీ పి. పూర్ణశంకరరావు తెలిపారు. మండలంలోని మున్నంగి, దంతలూరు గ్రామాల్లో సోమవారం పీఎం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ మాట్లాడుతూ కేంద్రం అమలు చేస్తున్న 17 పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నదే ఈ యాత్ర ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అనంతరం సభలో వివిధ శాఖల అధికారులు కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల పథకాల గురించి వివరించారు. అర్హత ఉన్న లబ్ధిదారుల పేర్లు నమోదు చేసుకున్నారు. గ్రామాల్లో వాహనం ద్వారా పథకాల్ని ప్రచారం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వేమూరి దీనమ్మ , ఏవో కె.వెంకటరావు, మండల వైద్యాధికారి చిక్కాల లక్ష్మీసుధ , సివిల్ సప్లయర్స్ డెడిప్యూటీ తహసీల్దార్ జె.వి.ఎస్.ఎన్. మూర్తి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి లబ్ధిదారులకు వివరిస్తున్న ఈవోపీఆర్డీ పి.పూర్ణశంకరరావు

మురుగు కాల్వలను పరిశుభ్రంగా ఉంచండి



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

తెనాలి అర్బన్: మురుగు కాల్వల్లో ప్లాస్టిక్ సంచులు, ఖాళీ వాటర్ బాటిల్‌లు వేయకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక సూచించారు. ఐదో వార్డు కవిరాజా పార్కు ప్రాంతంలో సోమవారం ఉదయం ఆమె పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుధ్య పనుల్ని పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆమె వెంట కౌన్సిలర్ తోట రఘురామ్, ఏఈ ఫణీంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు తాడిబోయిన రమేష్ ఉన్నారు.

యూనిడో సహకారంతో ‘స్వచ్ఛ గుంటూరు’కు కృషి

గుంటూరు కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరంలో కాలుష్యరహితంగా అభివృద్ధి పనులు చేపట్టడానికి యునైటెడ్ నేషన్స్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంటు ఆర్గనైజేషన్ (యూనిడో) సహకరిస్తోందని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో సోమవారం యూనిడో ప్రతినిధులు కమిషనర్‌ని కలిశారు. యూనిడో సహకారంతో నగరంలో చేపడుతున్న పనులపై చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కాలుష్యరహిత నగరంగా గుంటూరు నగరాన్ని మార్చుకోవడంలో యూనిడో గ్లోబల్ ఎన్విరాన్మెంట్ ఫండ్ (జీఈఎఫ్) ద్వారా సంపూర్ణ సహకారం అందిస్తోందని తెలిపారు. సంగంజాగర్లమూడి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో ఫ్లోటింగ్ సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేసిందని తెలిపారు. పనులు చివరి దశకు వచ్చాయని, త్వరలో గ్రిడ్ అనుసంధానం కూడా చేస్తామని వెల్లడించారు. నగరంలో ఇంటింటి చెత్త సేకరణకు కేటాయించిన ఈ–ఆటోల పనితీరును కూడా యూనిడో పరిశీలిస్తోందని చెప్పారు. రానున్న కాలంలో గుంటూరు నగరం యూనిడో సహకారంలో స్వచ్ఛంగా, కాలుష్యరహిత నగరంగా మారుతుందనే ఆశాభావాన్ని కమిషనర్ వ్యక్తం చేశారు. అనంతరం యూనిడో బృందం సంగం జాగర్లమూడి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో ఫ్లోటింగ్ సోలార్ ప్యానల్స్‌ని, క్షేత్రస్థాయిలో ఈ–ఆటోల పనితీరుని, చార్జింగ్ పాయింట్స్, నాయుడుపేట జిందాల్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంటును పరిశీలించారు. కార్యక్రమంలో వాషింగ్టన్ డీసీ సీనియర్ ఎవల్యూషన్ ఆఫీసర్ నీరజ్ కుమార్ నేగి, పీపీపీ స్పెషలిస్ట్ అలెగ్జాండర్ ఫ్రాన్సిస్ బర్గర్, యూనిడో ప్రాజెక్ట్ డాక్టర్ నందపాల్ సింగ్, పి.వి.రమణారావు, నగరపాలక సంస్థ ఎస్ఈ భాస్కర్, ఈఈ కొండారెడ్డి, డీఈఈ హనీఫ్, ఏఈ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



యూనిడో ప్రతినిధులతో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలి

స్పందనలో ప్రజల నుంచి అందే ఫిర్యాదుల్ని నిర్దేశిత గడువులోగా పరిష్కారం చేయాలని, అర్జీలు రీఓపెన్ అయితే విభాగాధిపతే నేరుగా పరిశీలించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో సోమవారం స్పందన నిర్వహించారు. తొలుత గత వారం అందిన అర్జీల పరిష్కారంపై సమీక్షించారు. ఫిర్యాదు పరిష్కారం కాకుండానే కొన్ని విభాగాల అధికారులు క్లోజ్ చేస్తున్నారని, ప్రజలు తిరిగి మరలా రీ ఓపెన్ చేస్తున్నారని తెలిపారు. సదరు అర్జీలను విభాగాధిపతే నేరుగా పరిశీలించి పరిష్కరించాలని, సిబ్బంది నిర్లక్ష్యం ఉంటే చర్యలకు సిఫార్స్ చేయాలని ఆదేశించారు. స్పందన అర్జీల అప్‌డేట్స్‌ని ప్రత్యేకంగా విభాగాధిపతులతో ఏర్పాటు చేసిన గ్రూప్‌లో పోస్ట్ చేసి, పరిష్కారాలపై సమీక్ష చేయాలని అదనపు కమిషనర్‌ని ఆదేశించారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 30 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి ఏడు, ఇంజినీరింగ్ విభాగానికి 10, రెవెన్యూ విభాగానికి ఆరు, ప్రజారోగ్య విభాగానికి ఏడు ఫిర్యాదులున్నాయని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ కె.లక్ష్మీ శివజ్యోతి, డెప్యూటీ కమిషనర్లు సీహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, మేనేజర్ శివన్నారాయణ, ఉపాసెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, డీసీపీలు, ఏసీపీలు, ఈఈలు, ఎస్ఎస్‌లు పాల్గొన్నారు

కార్మికులకు అండగా ఉంటాం

నగరపాలక సంస్థ కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటామని, పరిహారాల్ని వెంటనే అందించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. ఇటీవల మరణించిన ఇంజినీరింగ్ విభాగ కార్మికుడు టి.తిరుపతయ్య కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా చెక్‌ను సోమవారం కమిషనర్ చాంబర్‌లో అందించారు. ఇటీవల మరణించిన వెహికిల్ షెడ్‌లో డ్రైవర్ టి.తిరుపతయ్య భార్య సుందరమ్మకు ఎక్స్‌గ్రేషియా రూ.2 లక్షల చెక్‌ని అందజేశారు. నగరపాలక సంస్థ నుంచి పరిహారాలు, పీఎఫ్ కూడా త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగాధిపతుల్ని ఆదేశించారు. కార్మికులు తమ సమస్యలపై అర్జీలు లేదా ఫిర్యాదులు అందించవచ్చని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.

రక్షణ కోరుతూ మహిళ కమిషన్‌ను ఆశ్రయించిన మహిళ



కుమారుడితో బాధిత మహిళ

మంగళగిరి: భర్త నుంచి ప్రాణాపాయం ఉందంటూ కుమారుడితో కలసి ఓ మహిళ రాష్ట్ర మహిళ కమిషన్‌ను సోమవారం ఆశ్రయించింది. వివరాలు.. తెనాలి మండలం కొలకలూరుకు చెందిన అంజనాదేవికి 12 సంవత్సరాల క్రితం వివాహమైంది. భర్త వివాహమైన నాటి నుంచి సఖ్యతతో లేకుండా ఉండటంతో పాటు కొంతకాలంగా వేధిస్తున్నాడని వినతిపత్రంలో ఆరోపించింది. ఇప్పటికే పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొంది. సోమవారం రాష్ట్ర మహిళ కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. తనకు, కుమారుడికి భర్త నుంచి రక్షణ కల్పించాలని కోరింది.


స్కాలర్ షిప్ టెస్ట్ బ్రోచర్ విడుదల

తాడికొండ: చలపతి విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఐఐటీ–జెఈఈ/నీట్ అకాడమీని 2023–24 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభిస్తున్నామని చలపతి విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు తెలిపారు. బ్రోచర్‌ను విడుదల చేసిన ఆయన మాట్లాడుతూ ఐఐటీ–జేఈఈ/నీట్ అకాడమీ ఆధ్వర్యంలో 10వ తరగతి, చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు 10 లక్షల ప్రైజ్ మనీతోపాటు 100 క్యాష్ అవార్డులను ప్రకటిస్తూ డిసెంబర్ 10న స్కాలర్ షిప్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. గుంటూరు జిల్లా తాడికొండ మండలం మోతడక కళాశాల ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ తదితర వివరాలు బ్రోచర్‌లో ఇచ్చిన క్యూ ఆర్ కోడ్ లింక్ ద్వారా తెలుసుకోవాలని సూచించారు. ఇతర పూర్తి వివరాలకు 8886630340, 8886630341 నంబర్‌లను సంప్రదించాలని తెలిపారు. విద్యాసంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వై.సుజిత్ కుమార్, అకాడమీ డైరెక్టర్ గుంటుపల్లి శంకరరావు, మోతడక కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

టీడీపీ గ్రూపుల మధ్య ఘర్షణ

ఇరువర్గాలను స్టేషన్‌కు తరలించిన పోలీసులు

పాత గుంటూరు: తూర్పు నియోజకవర్గం టీడీపీలో గ్రూపు విభేదాలు తారస్థాయికి చేరాయి. నియోజకవర్గ ఇన్‌చార్జి నసీర్ అహ్మద్, ముజీబ్ గ్రూపుల మధ్య ఇటీవల ఘర్షణ జరిగింది. తాజాగా సోమవారం నియోజకవర్గంలోని 51 డివిజన్ డొంక రోడ్డు ప్రాంతంలో ఇరువర్గాల నాయకుల మధ్య వివాదం చెలరేగి ఘర్షణకు దారి తీసింది. తూర్పు నియోజకవర్గంలో టీడీపీ ఇన్‌చార్జి నసీర్ అహ్మద్ వర్గం, ఎంపీ గల్లా జయదేవ్ వర్గానికి చెందిన సయ్యద్ ముజీబ్ అసెంబ్లీ టికెట్లను ఆశిస్తున్నారు. ఎంపీ ఆదేశాల మేరకు ముజీబ్ వర్గం 51వ డివిజన్లో బాబు ష్యూరిటీ– భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సన్నాహాలు చేపట్టారు. డివిజన్లో రోడ్డు వెంబడి ముజీబ్ సోదరులు ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తుండగా నసీర్ వర్గానికి చెందిన డివిజన్ నాయకులు గొల్ల ప్రభాకర్, మహంకాళీ నరసింహారావు, దయా రత్నం అడ్డుకున్నారు. నసీర్ లేకుండా తమ డివిజన్లో కార్యక్రమాలు చేపట్టడానికి వీల్లేదని, ఫ్లెక్సీలు కట్టడానికి ఒప్పుకోమని తేల్చి చెప్పారు. ఈ విషయంలో ఇరువర్గాల మధ్య వాదనలు పెరిగి ఒకరినొకరు దూషించుకుంటూ ఘర్షణ వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న అరండల్‌పేట పోలీసులు వెంటనే సంఘటన స్థలాన్ని చేరుకొని ఇరువర్గాలను స్టేషన్‌కు తరలించారు.



దూషించుకుంటున్న టీడీపీ నాయకులు

టీడీపీ నేతలపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: టీడీపీలోని రెండు వర్గాలు పరస్పరం దాడి ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదుచేశారు. టీడీపీ నాయకుడు షేక్ ముజీబ్ అనుచరులు శ్రీనగర్ 4వ లైనులో పార్టీ ప్రచార కార్యక్రమం నిర్వహిస్తుండగా.. అదే పార్టీకి చెందిన నసీర్ వర్గం కార్యకర్తలు అడ్డుకున్నారు. ఇరువర్గాలు గొడవపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలకు చెందిన 20 మందిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలి



పట్నంబజారు: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కును నమోదు చేసుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా చెప్పారు. తూర్పు నియోజకవర్గంలోని 3వ డివిజన్ కార్పొరేటర్ పోలవరపు జ్యోతి ఆధ్వర్యంలో సోమవారం ఓటర్ నమోదు క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటును నమోదు చేసుకోవటంతో పాటు మంచి ప్రభుత్వాన్ని ఎంచుకునేందుకు దాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు వెంకటేశ్వరరావు, 15వ డివిజన్ కార్పొరేటర్ రామనబోయిన అజయ్ యాదవ్ పాల్గొన్నారు.

కనుల పండువగా కార్తిక కోటి దీపోత్సవం

తెనాలి టౌన్: గంగానమ్మపేటలోని శ్రీ విద్యాపీఠంలో సాలిగ్రామ మఠం ఆధ్వర్యంలో కార్తిక పౌర్ణమి సందర్భంగా సోమవారం కోటి దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పూజ్యశ్రీ బాలస్వామిజీ పర్యవేక్షణలో చంద్రమౌళేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు, భక్తులతో పూజలు చేయించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం వ్యవస్థాపకులు పూజ్య శ్రీ వెంకటేశ్వర యోగి గురూజీ కార్తిక పౌర్ణమి విశిష్టతను భక్తులకు వివరించారు. పెద్దసంఖ్యలో మహిళలు దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో మంద్రు శ్రీనివాస్‌కుమార్ గురూజీ, ట్రస్ట్ చైర్మన్ నంబూరి వెంకటకృష్ణమూర్తి, జాయింట్ సెక్రటరీ ఎం.రమణయ్య, ఉప్పల నాగేశ్వరరావు, గోపు రామకృష్ణ, లోకనాథం, రాజేశ్వరరావు, టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు కృష్ణ, గుంటూరు జిల్లాల అధ్యక్షుడు గడ్డిపాటి శ్రీనివాసరావు, అరుణకుమారి, అనూష, జయలక్ష్మి మాతృ మండలి సభ్యులు, శ్రీ విద్యాపీఠం లలితా సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న వెంకటేశ్వర యోగి గురూజీ

బైక్‌ల చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

నిందితుల్లో ఒకరు మైనర్

తెనాలి రూరల్: చెడు వ్యసనాలకు బానిసై బైక్‌ల చోరీలకు పాల్పడుతున్న యువకుడు సహా మైనర్ బాలుడ్ని పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక టూ టౌన్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో నిందితుల వివరాల్ని సీఐ ఎస్. వెంకట్రావు తెలియజేశారు. బైక్‌ల వరుస చోరీలకు పాల్పడుతున్న నందులపేటకు చెందిన సయ్యద్ అయాజ్‌తో పాటు ఇదే ప్రాంతానికి చెందిన మరో మైనర్ బాలుడ్ని అరెస్టు చేసినట్లు తెలిపారు. నందులపేటకు చెందిన సయ్యద్ అయాజ్ ఐటీఐ వరకూ చదివి గుంటూరు ఆటో నగర్‌లోని ఓ యాక్ససరీస్ షాపులో పని చేస్తున్నాడు. చెడు వ్యసనాలకు అలవాటు పడి సులువుగా డబ్బు సంపాదించేందుకు మోటార్ సైకిళ్లను చోరీ చేయాలని నిర్ణయించుకున్నాడు. దీనికి బైక్ మెకానిక్‌గా పని చేస్తున్న 15 ఏళ్ల మైనర్ సహకారం తీసుకున్నాడు. ఇద్దరూ కలసి ఇళ్ల ముందు తాళం వేసి ఉన్న బైక్‌లను మారు తాళాలతో చోరీ చేస్తున్నారు. ఈ విధంగా నందులపేట, నరేంద్రదేవ్ కాలనీల్లో రెండు పల్సర్ బైక్‌లు చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం మోటార్ సైకిళ్లతో వెళుతున్న ఇద్దరిని వీఎస్సార్ కళాశాల వద్ద గుర్తించిన టూ టౌన్ ఎస్ఐ టి. రమేష్ బాబు అదుపులోకి తీసుకున్నారు. రెండు పల్సర్ మోటార్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ సహా సిబ్బందిని సీఐ వెంకట్రావు అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకట్రావు, పక్కన ఎస్ఐ రమేష్‌బాబు

నిబద్ధత గల అభ్యుదయ సినీ రచయిత

103వ వర్ధంతి సభలో వక్తల నివాళి

తెనాలి: ప్రముఖ కమ్యూనిస్టు నేత, అభ్యుదయ సినీ రచయిత బొల్లిముంత శివరామకృష్ణ 103వ వర్ధంతి రోజైన సోమవారం సాయంత్రం స్థానిక సీపీఐ కార్యాలయంలో జానపద కళలపై సదస్సు నిర్వహించారు. సాహితీవేత్త బి.లలితానంద ప్రసాద్ అధ్యక్షత వహించారు. బొల్లిముంత శివరామకృష్ణ జీవిత విశేషాల్ని అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా ఉపాధ్యక్షుడు గోలి సీతారామయ్య తెలియజేశారు. కమ్యూనిస్టుగా, సినిమా సంభాషణలు, పాటల రచయితగా, పాత్రికేయుడిగా నిబద్ధతను చాటుకున్న తీరును వివరించారు. అరసం జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు, కనపర్తి బెన్‌హర్, ఏఐటీయూసీ నేత పరుచూరి వెంకటేశ్వరరావు, పాతూరి సుబ్రహ్మణ్యం కవి మాట్లాడారు. డప్పు రవి, కోలాటం ప్రసాద్, బుర్రకథ నాగమణి, కర్రసాము కోటి, తొలుబొమ్మలాట రవి తమ కళల గురించి మాట్లాడారు. డప్పు కళాకారులు నృత్య ప్రదర్శన చేశారు. ప్రజానాట్యమండలి నాయకుడు పి.రామారావు ప్రజా ఉద్యమ జానపద గీతాల్ని ఆలపించారు. బొల్లిముంత కృష్ణ స్వాగతం పలికారు. ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి నీలాంబరం పర్యవేక్షించారు. తొలుత బొల్లిముంత శివరామకృష్ణ చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించారు.



బొల్లిముంత చిత్రపటానికి నివాళి

ప్రజల చేతిలో శక్తివంతమైన ఆయుధం ఓటు

తెనాలి రూరల్: ప్రజల చేతిలో శక్తివంతమైన ఆయుధం ఓటు అని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కె. రవిబాబు సూచించారు. స్థానిక కొత్తపేటలోని ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో ‘స్వీప్’ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ‘ఓటు అవగాహన’ సదస్సును సోమవారం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ తెనాలి పట్టణ, మండల పరిధిలో నూతన ఓటర్ల చేరిక చురుగ్గా సాగుతోందని చెప్పారు. 18 ఏళ్లు దాటి ఇంకా ఓటును నమోదు చేసుకోని వారు త్వరితగతిన ఓటర్లగా నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యాచరణలో కళాశాల యాజమాన్యాల్ని కూడా భాగస్వాముల్ని చేస్తున్నట్లు పేర్కొన్నారు. కొత్తగా ఓటును నమోదు చేసుకునే వారికి స్థానిక బూత్ లెవల్ ఆఫీసర్ సహాయ, సహకారాలు అందిస్తారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ చింతల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటును నిర్లక్ష్యం చేస్తే నియంతృత్వం కంటే దారుణమైన పరిస్థితులు ఏర్పడతాయని తెలిపారు. యువత ఓటు విలువను తెలుసుకొని ప్రలోభాలకు లోను కాకుండా, విజ్ఞతతో ఆ హక్కును ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఎల్‌వోలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ రవిబాబు

సాంకేతిక విద్యతో పాటు జీవన నైపుణ్యాలు అవసరం

గుంటూరు ఎడ్యుకేషన్: ఫార్మసీ విద్యార్థులు సాంకేతిక విద్యతో పాటు జీవన నైపుణ్యాలు పెంపొందించుకోవాలని రాష్ట్ర ఔషధ నియంత్రణశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.అనిల్ కుమార్ పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో సోమవారం 62వ జాతీయ ఫార్మసీ వారోత్సవ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అనిల్‌కుమార్ మాట్లాడుతూ గ్రంథాలయంలో ఫార్మసీ పుస్తకాలను చదివి, నూతన పరిశోధనల గురించి అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఫార్మసీ నిపుణులకు గల ఉపాధి అవకాశాల్ని వివరించారు. కళాశాల గౌరవ చైర్మన్ డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులు ఔషధాల తయారీ నుంచి పంపిణీ వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాధ్యతల్ని వివరించారు. ఫార్మసీ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు.



మాట్లాడుతున్న అనిల్‌కుమార్

గాంధీ పార్కులో అదనంగా సిబ్బంది నియామకం

నెహ్రూనగర్: గాంధీ పార్కులో వింగ్స్ పాయింట్(సెల్ఫీ పాయింట్) వద్ద ఫొటోలు దిగే క్రమంలో మహిళల వద్ద ఏర్పడిన వివాదంపై నగర కమిషనర్ కమిషనర్ స్పందించారు. సెలవు రోజుల్లో పార్కు రద్దీ దృష్ట్యా అదనంగా సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సెల్ఫీ పాయింట్ల వద్ద ఫొటోలు దిగే సమయంలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఏడీహెచ్ రామారావును ఆదేశించారు. టికెట్ కౌంటర్ వద్ద మహిళలు, పురుషులకు ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పార్కుకు వచ్చే సందర్శకులు సంయమనం పాటించి, సిబ్బందితో సహకరించాలని ఆమె కోరారు.